# గాజు మేడ

"బాబ్బాబూ ! రాత్రి పదింటినుండి కాపలాకాశానండి. ఈ సరుకట్టుకు రాడానికి మూడయిపోయిందండి... మా కష్టం తవరే సూడాల...." అని వేడుకుంటున్నాడు కన్నారావ్.

"నువ్వెన్ని గంటలుంటే నాకేమి... సరుకంతా యిస్తే నాలుగు రూపాయలకన్నా గిట్టదు" అన్నాడు శ్రీపతి.

"అలాగనకండి బాబూ ! ఆ 'సిఐఎస్సె' జమాన్ను తప్పించుకోవడం కష్టమయి కొంతొగ్గేసి పారొచ్చినానండి...మళ్ళీసుట్టు తగ్గిద్దురుగాని ఇప్పుడు పది రూపాయలిచ్చియిండి"

"బావుందిరో నీ వ్యాపారం .. నేనేటి నోట్లు అచ్చుకొడతన్నా ననుకుంటున్నావేమిటీ ! అసలింకోడు ఇంకోడు అయ్యుంటే మూడ్రూపాయల కన్న పైసివ్వను. రెండేళ్ళనించి తెలిసినోడివికదా, బుద్ధిమంతుడివికదాని నాలుగన్నాను అంతే."

"నాలుగు మరీ తక్కువబాబు... నాతోటి ఇంకో ఇద్దరు గుంటళ్లున్నారుబాబు... ఆళ్ళద్గరికి కాపలా కాసినందుకు రెండేసివ్వాల. మరింత కష్టపడినందుకు నాకో రెండన్నా రావద్దా చెప్పండి !"

"ఒసోస్! రెండో ఎక్కం మాబాగా బట్టీ పట్టేసినావ్‌గాని ఇంకో రూపాయి కలుపుకో. ఇంద...ఐదూ తీస్కెళ్ళిపో... ఇష్టం లేకపోతే నీ సరుకట్టుకెళ్లి ఇంకోకాడమ్ముకో."

"దయసూపండి బాబూ !"

"ఇందులో దయేటుందోయ్? నువ్వు కష్టపడ్డావు! జవానుకంట్లో కారంకొట్టినావ్. పోర్టు సరుకట్టుకొచ్చినావ్ అంతవరకు సరే... అతర్వాత, ఏటవుతుంతో తెలుసా? నేనేటి మినిష్టరనుకున్నావా, నేపోతే ఆరి బావ మరిదనుకున్నావా? నాకూ పోలీసులనీ కమ్మర్షియల్ టాక్సులనీ అల్లుళ్లు న్నారుగదా, రెయిడింగులు, కట్నాలు చదివింపులూ వుంటాయా? ఎలక్షన్ ఫండ్సు వుంటాయా? అవన్నీ తడవకు వెయ్యి రెండు వేలు వదలి పోతుంటాయి... అవన్నీ ఎవడిచ్చుకోవాల... ఇందరికీ ఇన్ని ఇచ్చి నీక్కూడా పదులూ వందలూఇస్తే ఇంక నేను పూరీజగన్నాథమెళ్ళి పండాల్లో కల్సిపోవాలంతే!" అని కరాఖండిగా చెప్పాడు శ్రీపతి.

ఇంక గీ పెట్టుకున్నా పైసరాదని తెలిసి రెండు రెండురూపాయల నోట్లనూ, ఒక రూపాయనోటునూ అరచేతిలోనే ఇరికించుకుని - "వస్తాను బాబూ-" అని పోబోయాడు కన్నారావ్.

"చూడు కన్నారావ్ పదించీల బద్దీలు కావా" లన్నాడాయన .... బద్దీకి రూపాయిస్తానన్నాడు.

పిర్రమీద ఆతుకువేసిన మాసిపోయిన లాగు, చర్మంలో చర్మంగా కలిసిపోయిన ఫారిన్ బనియన్, సన్నగా అయిదడుగుల ఎత్తు, గద్దకళ్లలాటి కళ్ళు జూనియర్ బాబాలాటి జుత్తు, వందమీటర్ల పరుగు పందెంలో సునాయాసంగా జాతీయ రికార్డు స్థాపించగల కాళ్లు— ఇవి కన్నారావ్ ఆకారం.

సువిశాలంగా పరుచుకుని వున్నరేవు ఎస్టేటులోంచి ఇనుపఊచలు, బద్దీలు, మరలు కుళాయిలు, తలుపుల చిలుకులు, ఫిష్ప్లేట్లు వగయిరాలను తస్కరించడం వాడి వృత్తి. వాడి వయసు పదహారు, వాడి వయసు వృత్తి నాలుగు.

కన్నారావు పుట్టింది కుళ్ళుకాల్వ ఒడ్డున. పెరిగిందీ అక్కడే.

వాడి తండ్రి అప్పారావ్ సైకిల్‌రిక్షా తొక్కుతాడు. బాగా డబ్బులు వచ్చిన రోజున తప్పతాగి ఎక్కడో పడుకుండిపోతాడు. ఇంటికిరాడు. డబ్బులు మిగలని రోజున ఇంటికొచ్చి పెళ్ళాం సింహాచలాన్ని రగడచేసి నాలుగుబాది వెళుతుంటాడు. సింహాచలం మూడిళ్లలో పాచిపని చేస్తుంది. సద్దీ సుద్దీ తిని ఆ ముప్ఫై రూపాయలతో కాలక్షేపం చేస్తుంది. కన్నారావు వారాని కయిదో పదో తెచ్చియిస్తుంటాడు. వాడు డబ్బు ఎలా సంపాదిస్తున్నాడో తెలిసిన సింహాచలం— "ఓరబ్బీ".... కన్నారావూ! ఈ దొంగ బతుకు మానెయ్యరా! ఎవరి కాళ్లన్నా అట్టుకుని ఏదన్నా పనిలోకి, జేర్పిస్తాను.... చేరి మానంగా బతకరా—'' అంటుంటుంది. వాడిన్పించుకోకుండా ఎంగిలి సిగరెట్లు వూదుతూ పరుగెత్తి పోతాడు. గుడిసెముందు తలపట్టుక్కూచుండిపోతుంది సింహాచలం. ఆమె ఎదుట కుళ్ళు కాలువ...దాని కావలి ఒడ్డు కన్నారావు, ఈవలి ఒడ్డు అప్పారావు అయితే ఆ కాల్వనిండా, ఎన్నడూ ఎండకుండా, పుష్కలంగా పరవళ్లు తొక్కుతూపారే వూరంతటి కంపునీళ్లే సింహాచలం జీవితం.

...కన్నారావెళ్ళిపోయాక శ్రీపతి వాడమ్మి వెళ్ళిన సరుకంతా చూశాడు. "—స్టెయిన్లెస్ స్టీలు సామాను వుంది.... ఎంతలేదన్నా రెండొందలు వస్తుంది .." అనుకుని వాటంతటినీ వెనుక గదిలోవుంచి తాళం వేసి ముందువైపు షాపులోకి వచ్చాడు. గృహ పరికరాలు, ఇనుపసామానులు, పైపులు, ఫిట్టింగులు వగైరా అమ్మే ఆ షాపు ఆరుగురు గుమాస్తాలతో, కాతాదార్లతో - పవర్లో వున్న పార్టీలా వెలిగిపోతుంది.

ఓ గంటయ్యాక దీపాలు వెలిగాయి. శ్రీపతి దీపాలకు దండం పెట్టాడు. లేచి రెండగరొత్తులు వెల్గించి దేవుళ్ళ పటాలకు దగ్గరగా పెట్టాడు. మళ్లీ దండం పెట్టాడు అటు వినాయకుడు, ఇటు సత్యనారాయణస్వామి మధ్య మహాలక్ష్మి వున్నారు— అందంగా, రంగు రంగులుగా, గాజు పలకల వెనక చట్రాలలో

బందీలై! వాళ్ళ ముఖాలమీది నవ్వులను— ఈ మాయదారి పూజలు దొంగ దందాలు తెలిసి నవ్విన నవ్వులో - లేక చట్రంలో బిగించబడిన నిస్సహాయతకు అష్టకాల పొగడ్తలకు లొంగే బలహీనతకు - ఏడ్వలేక నవ్విన నవ్వులో తెలియదు మరి ... అగరొత్తుల పొగ మరి ముఖారవిందాలను కప్పివేసింది - అధికారుల ముఖారవిందాలను ధనధూపం కప్పి వేసినట్టు... ముగ్గురికీ కలిపి రెండంటి పండ్లను అతి భక్తితో నైవేద్యం పెట్టిన శ్రీపతి- ఆ రెండింటినీ తాళాల గుత్తిలోని చాకుతో ఎనిమిది భాగాలుగాచేసి ఆర్గురు గుమస్తాలకూ తలో ముక్క ఇచ్చి, తనో ముక్క కళ్ళ కద్దుకొని నోట్లో వేసుకున్నాడు. ఎనిమిదవ ముక్క నేమి చేద్దామా అనుకుంటుండగా వీధిలో తన దుకాణం ఎదుట నిల్చున్న ముష్టి వాడు కన్పడ్డాడు. వాడికి "దీపాలు పెట్టగానే ఎప్పుడూ రాకు. తెలిసిందా?" అని చారుచర్యవల్లించి వాడికో అరటిపండు ముక్కనిచ్చి, చేతిని తన స్వివెల్ ఛేర్ మీది తువ్వాలుతో తుడుచుకున్నాడు.

ఇంకో అరగంటయ్యాక- లేచి పెద్ద గుమస్తాను కేకేసి "ఇదుగో... జాగ్రత్తగా చూసుకుంటూవుండు. ఇప్పుడే పది నిముషాల్లో వస్తాను-" అని చెప్పి లేచి, నాలుగు వీధులవలతలవున్న సిమెంటు దుకాణానికి వెళ్ళి అక్కడ వున్న తమ్ముడితో ఆనాటి మంచిచెడ్డలన్నీ కనుక్కున్నాడు. పద్దులు వగైరా చూసుకున్నాడు. ఎనిమిదిన్నరకు మళ్లీ హార్డ్‌వేర్ దుకాణానికి వెళ్ళాడు. తొమ్మిదింబావుకు షాపు కట్టేశారు! తొమ్మిదిన్నరకు గుమాస్తా అఖరు సారిగా తాళం కప్పలాగి చూడడాన్ని గమనించాక కారెక్కాడు శ్రీపతి.

ఇంట్లో డైనింగ్ టేబిల్ దగ్గర కూచుని భోజనం చేస్తున్న శ్రీపతికి భార్య సుమతి వడ్డిస్తూంది.

రేడియో సిలోన్‌నుంచి "ఆఁసూఖరీ హై-యే జీవన్‌కీ కహానీ" అని ముఖేష్‌కాబోలు పాడుతున్నాడు. గాలికి కర్టెన్లు మత్తుగా కదులుతున్నాయి.

పెరుగన్నం కలుపుతూ శ్రీపతి అడిగాడు— "శ్రీను ఇంకా నిద్ర పోలేదూ?"

"వాళ్ళ నాన్నమ్మ దగ్గర కథ చెప్పించుకుంటున్నాడు...." అని నవ్వింది సుమతి. ఆమె నవ్వుకన్నా ఎక్కువగా మెరిసింది ఆమె రవ్వల ముక్కుపుడక.

ఆ డైనింగ్ హాలు కుడివైపున ఉన్న పడకగదిలో ఏడేళ్ల శ్రీనివాసు 'ఊ' కొడుతుండగా, వాడి తల దువ్వుతూ వాళ్లనాన్నమ్మ పరీక్షిత్తు మహారాజు కథ చెబుతూంది.

"ఆ విధంగా ఆ పరీక్షిత్తు మహారాజు శమీక మహర్షి మెడలో చచ్చిన పామును వేలాడవేసి వెళ్ళడం తెలిసిన ఆ మహర్షి కొడుకు-శృంగి మండిపడ్డాడు, "ఈ తుంటరిపని చేసిన రాజు ఈనాటికేడవదినం తక్షకుడనే పాముకాటుచే చచ్చుగాక!" అని శాపం పెట్టాడు శృంగి. ఆ శాపం విషయం ఎలాగో పరీక్షిత్తు మహారాజుకు తెలిసిపోయింది. ఎలాగయినా ఆ పాము నుండి తప్పించుకోవాలనిచెప్పి, ఏడు సముద్రాల మధ్య ఒక ఒంటిస్తంభం మేడ కట్టించుకుని, అందులోకి ఈగకూడా రాకుండా కట్టుదిట్టం చేసుకుని అందులో వుండసాగాడు —"

"ఏరా శ్రీనయ్యా! ఇంగా నిద్దపోలేదా?" అని గుమ్మందగ్గర నిలబడి అడిగాడు శ్రీపతి.

"లేదురా! వాడివాళ నాదగ్గరే పడుకుంటాడంట—" అంది శ్రీపతి తల్లి.

'ఊ! కథచెప్పు నాన్నమ్మా-' అని నసిగాడు నిద్రకలిపిన విసుగుతో శ్రీనివాస్.

ఆమె మళ్లీ కథ నెత్తుకుంది.

నవ్వుతూ శ్రీపతి పడకగదిలోకి వెళ్లాడు ఆసరికే సుమతి వెండి పళ్ళెంలోంచి ఆకులు ఒక్కొక్కటీ తీసుకుని ఈనెలుతీసి, చీల్చి సున్నం రాస్తూంది. అతడు రాగానే వక్కపోడి చేతికిచ్చింది.

వక్కపొడి నములుతూ నెమ్మదిగా అడుగులు వేశాడు శ్రీపతి, కిటికీ దగ్గరకువెళ్ళాడు, బయటకు చూశాడు. క్రింద తోట వీధిలోని నియాన్‌దీపం వెల్తురుతో ఆడుకుంటూంది. సాయకాలం పడ్డ ఆ కొద్దిపాటి చినుకులకే తోట లోని ఆకు పచ్చదనమంతా పులకరించినట్లుంది.

'ఏమండీ!' అన్నపిలుపు విని తిరిగాడు శ్రీపతి.

తమలపాకు చిలక నందుకున్నాడు శ్రీపతి, ఆమె చేయి పసుపుగా వుండడం గమనించి అడిగాడు.

'ఇవాళ శ్రావణ మంగళవారం కదా ... నోము నోచుకున్నాను-' అంది సుమతి

-బుధవారం మధాహ్నం ఒంటిగంటవస్తూంది. సూర్యాబాగ్ కూడలి దగ్గరకాస్త రద్దీ తగ్గింది. బండిమీద 'సుగంధి, నిమ్మ ఆరంజిక్రష్' లమ్మే దుకాణంమాత్రం జోరుగా వుంది.

చర్చి పిట్టగోడమీద కూచునీ వున్నారు కన్నారావూ, వాడి దోస్తు లిద్దరూ. సత్తెం కన్నారావు వయసువాడే. ఇంకానల్లగా వుంటాడు పీటర్ ఎర్రగా ఏయూరపియన్‌లాగో రష్యన్‌లాగో వుంటాడు. వాడమ్మ వాడికి అమ్మేగాని ఎవరికీ భార్యకాదు. కుళ్ళుకాలువ ఒడ్డున నావికుల కేళీ గృహాలలో పీటర్ తల్లి గుడిసె ఒకటి. వాడు మిగత ఇద్దరికన్న కాస్తచిన్నవాడుగా కన్పిస్తాడు.

'ఓ సిగరెట్టుంటే ఇవ్వరా' అన్నాడు సత్తెం.

'పేటా దర్జా సిన్మాలో ఊరో నాగ! అన్నాడు కన్నారావు.

'నాకాడున్నాయిరోయ్-' అని తన లాగు జేబులోంచి రెండు సిగరెట్లు పీకలు నాలుగయిదు ఆర్పేసిన బీడీలూ, ఒక చుట్టముక్కా తీసి దోసిట్లో వుంచాడు పీటర్. అందులోనుండి ఒక సిగరెట్టు తీసుకుని తన దగ్గరున్న అగ్గిపుల్లగీసి, వెలిగించాడు సత్తెం ఇంకో సిగరెట్టు పీకందుకున్న కన్నారావు సత్తెం సిగరెట్టు నుండి 'అగ్గి' అంటించాడు. తన స్టాకంతా మళ్లీ జేబులో వేసుకున్నాడు పీటర్.

రోడ్కు ఆవలివైపుకు ఒక ప్రక్కగా సెయింట్ పేట్రిక్ కాన్వెంట్ పిల్లలు నలభైమంది క్యూపద్ధతిలో నడుస్తున్నారు. వాళ్ళ యూనిఫారాలు ఆ ఎండలో తళతళ మెరుస్తున్నాయి. ఇద్దరు టీచరమ్మల సాయంతో ఆ పిల్లలందరూ "లివింగ్ ఫ్రీ'' సినిమాకు వెళుతున్నారు.

'ఆళ్ళను సూడ్రా...'

'ఎక్కడ కెళుతున్నారో ఏటో—'

'ఆటలకయి వుంటుంది ...'

'ఆటల కయితే బళ్లో కెందుకు వెళ్ళటం'

'సదవాల, పాటలు రాయాల, ఆడాల-'

'మరి మనకో...' సత్తెం ప్రశ్నకు జవాబుగా నవ్వాడు కన్నారావు. ఆనవ్వు చూచివుంటే గాంధీ మహాత్ముడు గాడ్సే వచ్చేదాక బతికేవాడు కాదు; తక్షణం ఆత్మహత్య చేసుకునేవాడు.

'సిన్మాల్లో ఇలాగే వుంటారు పిల్లలు,'

"ఒరారే! 'నిన్న టైగర్మాన్ సిన్మా సూశాన్రా! అందులవీస్టీయోడు సీట్లు సేసినాడురా... ఆడవ్వ గుండె అదిరిపోయిందనుకో...'

"పిట్లన్నీ వాడు సెయ్యేదసె... యుద్దాలు, బాక్సింగ్, గెంతడాలు అవ్వన్ని సెయ్యడానిక్కి వేరే మనుషులుంటారంట-"

''తగ్గు బ్రదర్- ఎన్టీవోడంటే ఏటనుకున్నావేటి- ఎంకటేశుడి అవతారం నాటోడు. ఇలాగనుకుంటే అలా ఆకాశంలోకి ఎగిరీయగల పవరుందాడికి'' అని సిగరెట్టు ఆఖరి దమ్ములాగి అవతలికి పారేశాడు సత్తెం.

'పైగర్మాన్‌లో జయమాలినుందిరా?'

'జయమాలిని డాన్సుందనుకో... కాని జైప్రదుంది గురూ పావలా ఐస్క్రీం పుల్లనాగుందనుకో-'

'నా కేటో జైప్రదవిష్టంలేదు బ్రదర్. ఆడదంటే సిల్కెవ్వే... అంతే!! సుక్కనాగుంతాది గుంట!'

-ఆ వెనకాల నాలుగు ఇనుప స్తంభాలమీద నిలబెట్టిన సువిశాలమైన సినిమా బోర్డుమీదఒయ్యారాలు ఒలకబోస్తున్న ఘనజఘనలూ. పీన పయోధరాంగనలూ ఈ కుర్రాళ్ల మాటలు విని నవ్వుకుంటున్నారు జలతారు రంగులలో.

— ఆ రాత్రి పదకొండు దాటింది. మిత్రులు ముగ్గురూ పాత పోస్టాఫీసు వైపునుంచి ఒక్కొక్కరుగా మోషిన్ వంతెన దాటారు. ఎడమ వైపు కొండమీంచి లైటవుసు దీపం వుండుండి జిగేల్మంటూంది! అవతలి కొండమీద చర్చి ఇంకోలోకానికి చెందిన దానిలా నిలబడి వుంది.

గుంట నక్కల్లా, ఆరి తేరిన అడుగులతో, దూరదూరంగా నడుస్తూ ముగ్గురూ నాలుగు జతల రైలు పట్టాలు దాటారు. వాళ్ళ వెనకాల కన్వేయర్ బెల్ట్ రొదచేస్తూ ఇనుప ఖనిజాన్ని మోసుకెళ్తూంది జపాను వాడి కోసం. ఈ ముగ్గురూ ఇనుప సరుకు కోసం వేటాడుతున్నారు శ్రీపతి దుకాణం కోసం.

వరుసగా మేంగనీసు ఖనిజం వున్న రైలు వ్యాగన్లు శ్రీరామ రక్షలా నిలబడి వున్నాయి. కాస్త ముందుకు మేంగనీసు రాళ్ళ దంపుల దగ్గర విద్యుద్దీపాల వెలుగులో నైట్ షిఫ్ట్ కార్మికులు స్కిప్పుల్లోకి నింపుతున్నారు. ఆస్కిప్పులనబడే బకెట్లలాటి వాటిని లాక్కుంటూ చిన్న అవి రింజను రేవులోకి తీసికెళ్తే అక్కడ కే బెర్త్ దగ్గర మాంగనీసు ఓడుంది.

అర్థ రాత్రయినా అక్కడ కార్మికులకేకలు, మాంగనీసును తట్టకెత్తి, స్కిప్‌లోకి పోసిన చప్పుళ్ళు, ఇంజనుకూత స్టీమరు పిలుపు, టగ్ అరపు, కన్వేయర్ రొదతో కోలాహలంగా వుంది.

వేగన్ల చాటున, మధ్యన సక్కి వంచుని పని మొదలెట్టారు కన్నారావు, పీటర్, సత్తెమూ. రాత్రితోనే వదులు చేయసాగేరు ; విరగ్గొట్టసాగారు ; పీకసాగారు ఫలానాది కావాలనికాదు, ఇనుపది ఏదివస్తే అది. మానవ అయస్కాంతాల్లాగా పనిచేయసాగారు మధ్యమధ్య సి. ఐ. ఎస్. ఎఫ్. జవానెవడన్నా వస్తాడేమోనని చూసుకుంటూ పనిసాగిస్తున్నారు. సత్తెం, వేగను అడుగు భాగంనుండి ఒకనాలుగడుగుల కడ్డీలాంటి దానిని వేరుచేయగలిగాడు. కన్నారావ్ ఒక ఫిష్ ప్లేట్‌ని తొలగించాడు. పీటర్ పట్టాలకు బిగించినట్లు బోల్టులు వదలు చేస్తున్నాడు. ఒంటిగంటయింది.

ఆకాశం లక్షలాది కళ్ళతో ఈ అనేకానేక దృశ్యాలను చూస్తున్నది.

"కీచ్‌ర్" మని పక్షి అరిచింది.

కాని, అదిపక్షి కాదని చెప్పింది. సత్తెం చెవి. కుడిచేతి బొటన వేలిని, చూపుడు వేలిని నోట్లో కలిసేలా తుడిచి చిన్న వార్నింగ్ ఈల ఇచ్చాడు వెంటనే. గబగబా కడ్డీని తీసుకుని వేగన్ అడుగునుండి కుళ్ళు కాల్వవైపు వచ్చేశాడు. సత్యం హెచ్చరికను విన్న పీటరూ జవాను వస్తున్నాడని తెలిసి రైల్వే ఓవర్ బ్రిడ్జి దగ్గర కొచ్చాడు. ఓవర్ బ్రిడ్జిమీదవున్న జవాను "కోన్ హై !" అని అరిచేసరికి — తుపాకిగుళ్ళ వర్షం మొదలయి

నట్లుగా పరుగెత్తారు సత్తెమూ, పీటరూ. సత్తెం మోషిన్ బ్రిడ్జికేసి పారి పోయి చీకట్లో కలిసిపోతే పీటర్ కుళ్ళు కాల్వ కడ్డంపడి దాపేశాడు.

కాని రాళ్ళ డంపులకు దగ్గరగా వేగన్లమధ్య "పని కానిస్తున్న" కన్నారావ్‌కు పక్షి అరుపులాటి జవాను విజిల్ కాని, సత్తెం హెచ్చరికకాని వినపడలేదు.

ఫిష్ ప్లేట్ చివరి బోల్టు తుప్పుపట్టి బిగుసుకుపోయి వుంటే దానిని నాలుగు వైపుల రాతితో కొడుతున్నారు.

హఠాత్తుగా తల వూడిపోయినట్లయింది.

తన జుత్తుపట్టి లాగినదెవరా అని చూచాడు కన్నారావ్.

సి. ఐ. ఎస్ ఎఫ్ జవాను!

--- గురువారం తెల్లవారు ఝామున శ్రీనివాస్ కలలో పరీక్షిత్తు హీరోగా, పాము విలన్‌గా, హోరాహోరీ పోరాడుతున్నారు. వాడు నిద్ర లోనే "బలేబలే" అని అరిచాడు. వాడికేకకు మెలుకువ వచ్చిన సుమతి వాడిని దగ్గరకు లాక్కుని వాడి కాళ్ళమీద తొలిగిన దుప్పటిని సరిజేసింది.

టెలిఫోన్ మోగింది.

అదిరిపడి లేచి వెళ్ళింది సుమతి హాల్లోకి, మరునిముషం వచ్చి శ్రీపతిని కుదిపిలేపింది.

ఎక్కణ్ణుంచిచబ్బా ఇప్పుడు ట్రంకాల్ - అనుకుంటూ వెళ్ళి అందు కున్న శ్రీపతి, కుర్చీలో కూలబడ్డాడు.

ఆ ఫోన్‌కాల్ రెండునిముషాల్లో ముగిసింది.

శ్రీపతి కుర్చీలోంచి లేవలేదు.

"ఏమండి .... ఏమయింది ?" అని ఆదుర్దాగా అడిగింది సుమతి.

"ప్రాజెక్టు సైట్ నుండి సిమ్మెంటు బస్తాలు వస్తున్న మనలారీని ఎన్ హెచ్-5 దగ్గర పోలీసులు అటకాయించారట" అని చెప్పి వెంటనే తన అడ్రసుల పుస్తకం తెచ్చి రెండు నెంబర్లకు ఫోన్‌చేసి, క్షమాపణలతో మొదలుపెట్టి ధన్యవాదాలతో ముగించి లేచాడు.

బట్టలు తొడుక్కున్నాడు.

గరాజ్ నుండి కార్‌తీసి తనే నడపసాగాడు. పోలీసు స్టేషన్ సి ఐ .... ఆతడిని చూడగానే లేచి నిలబడ్డాను.

"అయ్యో-తమరే వచ్చారేటండీ ఈవేళప్పుడు-" అని నమస్కారం చేశాడు.

"పరవాలేదండి .... అవసరం వచ్చినప్పుడయినా రావద్దంటేఎలా?" — అని శ్రీపతి వివరంగా అన్నీ చెప్పాడు.

"అయ్యో వెధవా ; ఆ కేశవులుగాడా శ్రీకాకుళంనుంచి మొన్ననే వచ్చినాడండీ- వాడికి వూళ్లో పెద్దఎవరో, చిన్నెవరో ఇంకా తెలీదండి - పొరపాటయిపోయింది .... మీకెందుకు నేనింకో పది నిముషాల్లో మీలారీ దగ్గరుంటాను, దానిని సూర్యోదయం లోగా మీ దుకాణంలోకి అన్‌లోడింగ్ చేయించకపోతే సీ ఎమ్‌తో చెప్పి నా ఉద్యోగం తీయించేయండి —" అన్నాడు సి. ఐ.

"భలేవారండి ! మీలాంటి మిత్రులుండబట్టి ఏదో ఇలా బ్రతగ్గలుతున్నాము —" అన్నాడు శ్రీపతి.

"అమ్మమ్మ ఎంతమాట .... నేను పనంతా తెమిల్చి ఏడోగంటకు మీ ఇంటికొచ్చి రిపోర్టిస్తానుకదా ...."

"తప్పక రండి-'' అని లేచిన శ్రీపతి, సిఐ లోపలిగదిదాటి బయట హాలుదాటి హాల్లోకి రాగానే —

"బాబుగారూ :'' అని అరుపు వినబడింది-

"బాబుగారూ ! నన్నిడిచెయ్యమని చెప్పండి. బాబుగారూ .... నన్ను కొట్టొద్దని చెప్పండి బాబుగారూ ! బాబుగారూ !'' —

అటువైపు కటకటాలవెనక అరుపు, ఏడుపు, కన్నీరు, రక్తపు చారలుగా కన్పించిన కన్నారావును చూచి శ్రీపతి గబుక్కున తల ఇటు త్రిప్పుకున్నాడు.

"వాళ్ళమ్మ మా ఇంట్లో పనిచేస్తుండేది. ఓసారి ఓ స్టీలుపళ్ళెం దొంగిలించి పట్టుబడింది పన్నించి తీసేశాం. అప్పుడప్పుడు ఏదయినా సద్దీ బొద్దీ తినడానికొచ్చేవాడు కాపోలీ వెధవ—' అని శ్రీపతి వివరించాడు.

"అలాగాండి. దొంగనాకొడుకులండి, రాత్రి పోర్టు ఏరియాలో రాళ్ళ దంపులకాడ దొరికాడండి, వీళ్ళతో పెద్ద న్యూసెన్సయింది.''

"అంతే తల్లి దొంగయితే బిడ్డ దొరెలా అవుతాడు ?'' అంటూ జెనెటిక్ సూక్తిని వల్లించిన శ్రీపతి — 'బాబుగారూ' ! అన్న గావుకేక విని అదిరిపడ్డాడు.

"నోరుముయ్యేస్ !'' అని కాన్‌స్టేబుల్ కర్రతో ఒక్కటిచ్చుకున్నాడు.

కానీ కన్నారావ్ అంత నొప్పిలోనూ చూచినచూపు ఎందుకు చురుక్కుమందో సిమెంటుబస్తాకు అర్థంకాలేదు ! బస్తాకారెక్కి ఇల్లుచేరింది.

— శుక్రవారం తెల్లవారుఝామున శ్రీనివాస్ నిద్దర్లో వున్నాడు. శ్రీపతి నిద్రపోతున్నాడు. సుమతి మేలుకుంది. అయినా పడుకునేవుంది.

శ్రీపతి తల్లి లేచి. తలస్నానంచేసి తోటలోంచి పారిజాతాలు నంది వర్ధనాలు, మందారాలు, తులసి, విరజాజి కోసి వెండి బుట్టలోకి తీసుకుంది! "హిరణ్మ వర్ణాం హరిణీం —" అంటూ శ్రీసూక్తం వల్లిస్తూ పూజ గది లోకి వచ్చింది.

గదంతా తుడిచి ముగ్గువేసింది,

దీపాలు వెల్గించింది.

రెండువందల — ఖాళీ పెన్సిలిన్ సీసాలను అరల్డయిట్‌తో అతి కించి తయారు చేసిన అతి అందమైన నాల్గంతస్తుల మందిరంమధ్య వెండి మహాలక్ష్మి విగ్రహం వుంది. ఇటూఅటూ వెంకటేశ్వరుడు, దుర్గ సరస్వతి. రాముడు, కృష్ణుడు కొలువుతీర్చి వున్నారు.

పెద్దామె పూజ ఆరంభించింది.

ఇందు శీతలాయైనమః —

"ఆహ్లాద జన న్యైనమః

తుష్ట్యైనమః —

దారిద్ర్య నాశిన్యై నమః —"

లక్ష్మిఅష్టోత్తరం సాగుతూంది.

ఖణేల్ మంది !

ఒక్క గులకరాయి కిటికీగుండా తుపాకిగుండులా దూసుకొచ్చి ఆ లక్ష్మి మందిరంపై కలశాన్ని తాకింది! అది ముక్కలయింది.

"అయ్యో !" అని ఆదిరి పడిపోయిందావిడ. కాంపౌండ్ గోడనుండి ఎవరో గెంతి వీధిలోకి పరుగెత్తడం ఆమె వినలేదు.

"ఏమయిందత్తమ్మా—" అని కుచ్చిళ్ళూడి పోతుండగా పరుగెత్తు కొచ్చింది సుమతి.

అ వెనుకే వచ్చాడు శ్రీపతి.

— శ్రీనివాస్ నిద్రలో పాము కాటేసింది. పరీక్షిత్తు శరీరంలోకి విషం ఎక్కసాగింది.

ఆతడు విష్ణుమూర్తిని ప్రార్థించసాగాడు.

★